ఓంశ్రీసాయిరాం

శాస్త్రంబునెప్పుడు సత్యంబుగానెంచు
వేదసమ్మతమగు విప్రులార
దేశంబుకొరకునై దేబమర్పణజేయు
రహిమించు రాజాధిరాజులార
ధనధాన్యముల్‌గల్గి ధర్మగుణంబుతో
వరలుచుండెడి ఆర్యవైశ్యులార
వ్యవసాయవృత్తిచే వర్ధిల్లుచుండియు
సుఖజీవనముజేయు శూద్రులార
కాలమంతయునూరక గడపనేల
సర్వజన సమ్మతంబుగ సత్యమైన
దైవనామంబు సల్పుడీ ధన్యులౌదు
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.

విద్యార్థులారా!

వేదాంతమందు తారకము, సాంఖ్యము, అమనస్కము ఈ మూడూ ఏవిధముగా త్రిమూర్త్యాత్మక స్వరూపమై వున్నదో అదేవిధముగా పారమార్థికము, ప్రాతిభాసికము, వ్యావహారికము అని మూడు మార్గములు వుంటున్నవి. ఈ పారమార్థికమే ఒక సముద్రము. వ్యావహారికమే ఈ సముద్రమునందలి అలలు. ప్రాతిభాసికము అలలయందున్న నురుగు. అలలు లేక నురుగు లేదు. నీరు లేక అలలు లేవు. ఏతావాతా అలలు, నురుగు రెండూ సముద్రము నీటితో చేరినవి. పారమార్థికము వేరు, వ్యావహారికము వేరు, ప్రాతిభాసికము వేరని మనము భావించ కూడదు. ఈ మూడూ త్రిమూర్త్యాత్మక స్వరూపమే. ఈ మూడూ త్రిశూలముయొక్క స్వరూపమే. మూడింటియొక్క ఏకత్వము గుర్తింపచేసేదే దివ్యత్వమైన పరబ్రహ్మ తత్త్వము.

పారమార్థికము ఆత్మ అనియు, వ్యావహారికము అహంకారమనియు భావిస్తారు కొందరు అజ్ఞానులు. ఈ రెండు ఒక్కటి కాదు. ఆత్మ, అహం ఇవి ప్రత్యేకించినవి. ఆత్మ సముద్రము. ఈ అహం అలలు. అయితే అంతర్ దృష్టితో మనము విచారణ చేసినప్పుడు రెండూ ఒక్కటే. సముద్రము కంటె అలలు వేరు కాదు. కట్టెయందు అగ్ని యిమిడి వుండినట్టుగా, తిలలయందు తైలము చేరినట్లుగా, చెరకునందు చక్కెర వుండినట్లుగా పారమార్థికమందు వ్యావహారికము లీనమై వుంటున్నది. సముద్రము లేక అలలు లేవు. అదేవిధముగా తండ్రి లేక కుమారుడు లేడు. కుమారుడు లేని తండ్రి వుండవచ్చును గానీ తండ్రి లేని కుమారుడు వుండటానికి వీలు లేదు. అదేవిధముగా పారమార్థికము లేని వ్యావహారము వుండుటకు వీలు కాదు. కనుక, వేదాంతమునందు భగవంతుని భావః అన్నారు. భావః అనగా దృశ్య కల్పితమైన ఈ చరాచర ప్రపంచమంతయూ తన స్వరూపముగా నిరూపించేదే భావస్వరూపుడు.

జగత్తు కేవలము కార్యస్వరూపము. కారణము విష్ణువు. కార్యకారణ స్వరూపమే జగత్తు. జగత్తునందు భగవంతుడు అనేక అంగములతో, అనేక రూపములతో దిగివచ్చి సర్వరూపముల సమన్వయము బోధిస్తున్నాడు. చక్కని రంగుల పింఛముతో కూడిన నెమలి ఏవిధంగా అందముగా వుంటుందో సర్వ మానవత్వమును చేర్చుకొన్న విష్ణుత్వము. దీనినే వేదము, 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్'. అనేక శిరస్సులతో కూడినది విశ్వము. అనేక నేత్రములతో కూడినది ఈ విశ్వము. అనేక పాదములతో కూడినది ఈ విశ్వము. దీనిని పురస్కరించుకొని మనము విచారించిన ప్రతి వ్యక్తి విష్ణుస్వరూపమే!

భగవంతునకు కూటస్థుడు అని మరొక పేరు. అనగా భగవంతునియందు అన్నింటి ఏకత్వము నిరూపించే

తత్త్వము వుంటున్నది. నురుగు, అల, సముద్రము మూడింటియొక్క ఏకత్వము యేవిధంగా వుంటున్నదో, దివ్యత్వములోనుండిన సృష్టిస్థితిలయములు కూడను కూటస్థమైన స్థితికి చేరుకుంటాయి. అంతా సచ్చిదానంద సాగరము నుండి ఏర్పడినవే. ఇదియే మానస సరోవరమునుండి ఆవిర్భవించిన ఆనందము. కనుక, ఈ ఆనందమునకు మూలకారణము సత్‌చిత్. సత్ అనగా సత్యము. చిత్ అనగా జ్ఞానము. ఈ రెండింటి ఏకత్వమే ఆనందము. సత్ అనేది చక్కెర. చక్కెర దేనియందున్నా మాధుర్యముగానే వుంటుంది. కాఫీలో చేర్చు, మధురంగానే వుంది. టీలో చేర్చు, మధురంగానే వుంది. పాయసంలో చేర్చు మధురంగానే వుంది. నీటిలో చేర్చు మధురమైన పానకంగానే వుంటుంది. ఈ చక్కెర తీపిదనము ఎప్పటికీ వుండేదే. సత్ అనగా being మార్పు లేనిది. అదే చక్కెర. చిత్, ప్రాణసంబంధమైన తత్త్వము ప్రజ్ఞానం బ్రహ్మ constant integrated awreness ప్రబోధించేది. ఇది ఎప్పుడూ సజీవంగానే కదలుతుంది. ప్రాణమునకు జలము ప్రధానము. కనుక, చిత్ అనేది నీరు, సత్ అనేది చక్కెర. ఈ రెండూ విడిగా వుంటుంటే చక్కెర చక్కెరే, నీరు నీరే. రెండూ చేర్చినప్పుడు పానకంగా తయారౌతుంది. అదేవిధముగా సత్, చిత్ రెండూ చేరినప్పుడే ఆనందము రూపొందుతుంది. ఆనందము మన స్వరూపమే! సత్ అనే ఆత్మతత్త్వము నిరంతరమూ వుండేదే. ఆత్మతత్త్వమే లేక జగత్తులో దేనికీ రాణింపు లేదు. కాగితము చాలా విలువైనదిగా వుంటున్నాది. దానిపై అక్షరములు చూస్తే అందముగా వుండే అక్షరములు. ఆ అక్షరములు అందమైన కవిత్వముగా వుంటున్నాయి.

వాసుకిశయన శ్రీనివాస చిద్విలాస
భవపాశముల ద్రుంచి మనోల్లాసమివ్వరా
భాసురకళ్యాణపురవాస
శ్రీగోపదాసుని బ్రోవరా
సందుగొందులందు మరిఅందరందు నీవె
ఆనందమొందుచుందువని విందు శ్రీధరా!
ఇందువదన సురేంద్రముని వందిత పాదారవింద
నిత్యానంద గోవింద వేగ బ్రోవరారా

ఇలాంటి సుందర కవిత్వముతో కూడిన అక్షరాలు వ్రాసారు. కాగితము విలువైనదే, అక్షరములు చాలా అందమైనవే, కవిత్వము విచిత్రమైనదే. కవరులో పెట్టాము. కవిత్వమునకు విలువ వుంది, అక్షరములకు విలువ వుంది. కాగితమునకు విలువ వుంటున్నాది. కవరుకు విలువ వుంటున్నాది. ఎడ్రస్ వ్రాసి పోస్టు చేశావు. కానీ, ఎవరికి చేరాలో వారికి చేరలేదు. దేని వల్ల? స్టాంపు లేదు. అదేవిధముగా రాగతాళములతో మనం భజన చేస్తున్నాము. అన్నింటియందు ఆనందముగానే వుంటున్నాది గానీ ఆత్మవిశ్వాసము అనే స్టాంపు లేదిక్కడ. ఆత్మవిశ్వాసమనే స్టాంపు వెయ్యాలి. ఈ విశ్వాసము లేదు. శ్రద్ధ, విశ్వాసములకు తగిన ప్రేమ. ప్రేమ వుండినప్పుడే శ్రద్ధ వస్తుంది. శ్రద్ధ వుండినప్పుడే విశ్వాసము వస్తుంది. కడపటికి శ్రద్ధ, విశ్వాసము, ప్రేమ మూడూ వేరు కాదు, ఒక్కటే. నురుగు, అల, సముద్రము ఎలా ఒక్కటైపోయిందో శ్రద్ధ, విశ్వాసము, ప్రేమ ఈ మూడింటియందు ఏకత్వము కలగాలి. ఇదే వేదాంతమునకు సరైన ఆధారము.

ఇచ్ఛ, పరేచ్ఛ, అయేచ్ఛ ఈ మూడింటియందున్న అంతరార్థము ఏమిటి? ఇచ్ఛ అనగా స్వేచ్ఛ అనికూడా చెప్పవచ్చును. స్వేచ్ఛ అనగా ఈనాటి విద్యార్థులు యిష్టానుసారం మాట్లాడటము, యిష్టానుసారం సంచరించటము, యిష్టానుసారం ప్రవర్తించటముఅనుకుంటారు. ఇది కాదు స్వేచ్ఛ అంతరార్థము. స్వ ఇచ్ఛ స్వేచ్ఛ. ఆత్మ ఇచ్ఛయే నిజమైన స్వేచ్ఛ. ఆత్మయిచ్ఛను మనం అనుసరించాలి. ఈ ఆత్మతత్త్వమే నేను అనే పదమునకు ఆధారము. 'నేను' ఈ నేను అనేది రెండు రకాలుగా వుపయోగిస్తున్నాము. దీనిని పురస్కరించుకొనియే గీతయందుకూడా పరధర్మ, స్వధర్మ అన్నారు. స్వధర్మమనగా క్షత్రియధర్మము, బ్రాహ్మణధర్మము, వైశ్యధర్మము యిలాంటి జాతికులములకు

సంబంధించినవిగా భావిస్తున్నారు. ఇది కాదు స్వధర్మము. స్వ..ఆత్మ. ఆత్మధర్మమే స్వధర్మము. పరధర్మమనగా దేహధర్మము. కాబట్టి, 'నేను' రెండు రకములుగా వుంటున్నది. ఒకటి ఏకాక్షరి 'I' రెండవది eye మూడక్షరములు. ఈ eye దేహము. ఏకాక్షర 'I' ఆత్మ. దేహము లేక ఆత్మను తెలుసుకోలేము. ఆత్మ లేక దేహము వుండటానికి వీలులేదు. కాబట్టి దేహాత్మజీవతత్త్వము మూడింటి ఏకత్వమే త్రిపుటి. త్రికూటము అన్నారు. ఈవిధముగా చిన్నచిన్న పదములలో పవిత్రమైన మార్గాన్ని నిరూపిస్తూ వచ్చింది వేదాంతము.

స్వేచ్ఛ అనగా తానే సంకల్పించి 'నేనీ కార్యము చేస్తున్నాను' అని నిర్ణయించి ఆ కార్యములు చేసి ఆ కార్యములలో వచ్చిన ఫలితము సుఖమో, దుఃఖమో యేమాత్రమూ విచారించక ఇది నేనే అనుభవించాలి. ఎందుకనగా నేనే దీనిని కోరి, వరించి ప్రవర్తించాను. నేను యిష్టపడే చేశాను. ఈ యిష్టపడి చేసిన దానిలో దుఃఖముగానీ ఆనందముగానీ నేను అనుభవించే తీరాలి. దీనికి యేమాత్రమూ వెనుకంజ వేయకూడదు అనే విశ్వాసముతో చేసేదే స్వేచ్ఛ. ఇంక పరేచ్ఛ. అనగా ఇతరుల ప్రోత్సాహము వలన, వత్తిడి వలన కార్యములో పాల్గొంటాము. నీ స్వేచ్ఛతో చేసినది కాదు. ఇతరుల ప్రోద్బలముచేత, ఇతరుల వత్తిడిచేత ఒక కర్మను నీవు ఆచరించావు. అయితే అప్పుడుకూడా యిష్టపడి చేసినది కాదే అని యేమాత్రమూ విచారించకూడదు. ఇతరుల ప్రోద్బలము వల్ల జరిగినా ఇది నేనే చేశాను, చేసినది నేను, ప్రోత్సాహము వారిది. నిజముగాచేయటానికి ఉత్సాహమే నాలో లేకపోతే ప్రోత్సాహము యేమిచేస్తుంది? కాబట్టి, ఉత్సాహము నాలో ఉండబట్టే ప్రోత్సాహము కొంచెం హెల్పు చేసింది. ప్రోత్సాహముతో చేసినది కూడను నేనే అనుభవించాలి. మూడవది అయేచ్ఛ. ఇది ప్రోత్సాహము కాదు లేక నా సంకల్పము కాదు. ఇది కేవలము దైవేచ్ఛగా లభ్యమైనది. దైవేచ్ఛగా లభించే సుఖముగానీ, దుఃఖముగానీ ఆనందముగా అనుభవించాలి. ఇది యింకొకరి వత్తిడి కాదు. లేక నాకై నేను ఆచరించినది కాదు. దైవేచ్ఛగా వచ్చినది. దైవేచ్ఛగా వచ్చినప్పుడు కేవలం మంచే జరుగుతుంది. దైవేచ్ఛగా జరిగిన ప్రతి కార్యమందు మాధుర్యము, విజయము, శాంతి, ఆనందము, సౌఖ్యము యివన్నీ చేకూరుతాయి. కానీ ఈనాటి మానవుడు ఈ విశాలమైన అర్థము తీసుకోటం లేదు.

పుణ్యస్యఫలమిచ్ఛంతి పుణ్యంనేచ్ఛంతి మానవః
న పాపఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః

పాప ఫలము నాకు వద్దంటున్నాడుగానీ పాప కార్యములు చేస్తున్నాడు. పాపకార్య ఫలము వద్దన్నవాడు పాపకార్యము ఎందుకు చేయాలి? నీ పాపకార్యము చేతనే నీకు పాపఫలము వస్తుంది. పుణ్యఫలము కావాలని ఆశిస్తున్నావు. కానీ, పుణ్యకార్యాలు చేయటానికి ముందంజ వేయటంలేదు. ఎందుకు? కావాలని కోరేది ఒకటి, దానికి విరుద్ధముగా కర్మలాచరించటం. నీ ఆశలు పురస్కరించుకొనియే నీ కర్మలు వుంటుండాలి. పాపఫలము నీవు వద్దనకూడదు. నేను చేశాను, తప్పక రావలసిందే దాని ఫలము. నీవు తెలిసి ముట్టినా, తెలియక ముట్టినా అగ్ని కాలుస్తుందేగానీ తెలియక ముట్టాడని అగ్ని చల్లబడదు. నీవు యిష్టపడినా, యిష్టపడకపోయినా నీ కర్మఫలము అనుభవించే తీరాలి. ఇది వ్యావహారిక సత్యము. కానీ, పారమార్థిక సత్యము అలాంటిది కాదు. అగ్ని వుండినప్పటికీ, నీవు దానిని ముట్టినప్పటికీ అది నిన్ను కాల్చకుండా వుంటుంది. ఏవిధంగా? కేవలము దైవానుగ్రహము చేతనే. ముందుగానే అగ్ని వుందనే జ్ఞానమును అందిస్తుంది. అగ్నిని కూడా దైవత్వముగానే విశ్వసించాలి. పంచభూతములలో అగ్నికూడా ఒకటి.

ప్రతియొక్కదానియందు అహం అనేది ప్రవేశిస్తున్నది. అహంతత్త్వము ఎక్కడనుండి పుట్టినదని విచారణ చేయాలి. అహం అనేది ఆత్మనుండి పుట్టినది. అహం నుండి ఏది వుట్టింది? సంకల్పము పుట్టింది. సంకల్పమునుండి ఏమి పుట్టింది? వాక్కు పుట్టింది. వాక్కు సంకల్పమునుండి, సంకల్పము అహంనుండి, అహం ఆత్మనుండి పుట్టాయి. ఇదే త్రిపుటి. అహం ఆత్మకు కుమారుడు. సంకల్పము మనవడు. వాక్కు మునిమనవడు. ఇదంతా ఒకే కుటుంబముయొక్క సంబంధమే!కుమారునికి, మనుమనికి, మునిమనవనికి ఆత్మ ప్రోపరిటీపై హక్కు

వుంటున్నాది. ఆత్మయొక్క ప్రోపరిటీ ఏమిటి? సత్‌చిత్‌ఆనందము. ఈ సత్‌చిత్‌ఆనందములు కుమారునికి, మనుమనికి, మునిమనుమనికి సంపూర్ణముగా వ్యాపించి వుంటున్నాది. మానవుడు, 'ఆనందము లేదు నాలో' అని అనుకోకూడదు. ఇది మీ హక్కు. నిరంతరము నిత్యసత్యమైనవాడుగా వుండాలని ఆశిస్తున్నావు. అదే being అదే నీ రైట్. చిత్ అంటే ఏమిటి? ప్రజ్ఞానం బ్రహ్మ. ఆ బ్రహ్మజ్ఞానము నీయందే వున్నది. కనుక, నీవు సచ్చిదానందమును ఎక్కడా వెతకనక్కరలేదు. నీయందే వుంటున్నది సచ్చిదానందము. అయితే, నీవు తెలుసుకోలేకపోవటం చేత పట్టి పీడిస్తున్నాది అజ్ఞానము.

విద్యార్థులారా! టక చిన్న కథ వుంటున్నాది. ఒక పెండ్లి జరుగుతున్నాది. కన్యవైపువారు ఒక యింటిలో వున్నారు. వరునివైపువారు ఒక యింటిలో వున్నారు. మధ్యలో సంభాషణ జరుపుటకు ఒక సంబంధి యేర్పడ్డాడు. కన్యవైపువారి దగ్గరకు వెళ్ళి ప్రతి పర్యాయము వారిన దబాయిస్తున్నాడు. 'ఏమిటండీ! వేళవేళకు మాకు కాఫీటిఫిన్లు సప్లై చేయటం లేదు. వివాహము చాలా గ్రాండ్‌గా చేస్తారనుకున్నాను. ఏమీ చేయటం లేదే. ఏమీ శ్రద్ధ చూపటం లేదే' అని వాదిస్తున్నాడు. మరొక పర్యాయము వారివైపు వస్తున్నాడు. 'ఏమిటి మీరు ఎన్ని పర్యాయములు పిలిచినా రావటం లేదే. వంటలంతా చల్లబడిపోతున్నాయి. తప్పక రండి త్వరగా' అని వారిని జబర్దస్తి చేస్తున్నాడు. వరునివైపు వారి దగ్గరకొచ్చి జబర్దస్తి చేస్తున్నప్పుడు కన్యవైపు పెద్ద యజమాని అనుకున్నారు. కన్యవైపుకు వెళ్ళి జబర్దస్తి చేస్తున్నప్పుడు వరునివైపు యజమాని అని వారు తలచారు. కానీ, ఇతని స్వతంత్ర్యము పెచ్చుపెరిగిపోయింది. ఇరువైపులవారికి విసుగు పుట్టింది. అప్పుడు విచారణ ప్రారంభించారు. ఎవరండి ఇతను? వరునివైపు వారు వచ్చి, 'ఎవరండి ఇతను?' అని అడిగారు. 'మాకేమీ తెలియదు' అన్నారు. ఇరువురూ కలిసి ఎంక్వైరీ చేసేటప్పటికి పరారి యితను. తన గుట్టు బట్టబయలైందని తప్పించుకొని పరిగెత్తాడు. అదేవిధముగా అజ్ఞానము ఒక పర్యాయము ఆత్మవైపున, మరొక పర్యాయము ప్రకృతివైపు పయనించి ప్రకృతిని, ఆత్మను జబర్దస్తి చేస్తుంటుంది. ఆత్మ, అనాత్మ గురించి విచారణ చేసినప్పుడు అజ్ఞానము అంతర్థానమైపోతుంది. అట్టి విచారణ మనం ఈనాడు జరపటం లేదు.

ఈ విచారణకు నాలుగు మార్గములుంటున్నాయి. మీకందరికీ తెలుసు. మీయందున్నది bookish knowledge కొన్ని దినముల తర్వాత superficial knowledge గా మారిపోతుంది. ఈ superficial knowledge తరువాత general knowledge గా వస్తుంది. general knowledge వచ్చినప్పుడే discrimination knowledge చూడాలి. ఆ discrimination individual discrimination గా వుండకూడదు. fundamental discrimination కావాలి. discrimination knowledge తరువాత practical knowlegge వస్తుంది. ఈ practical knowlegge నిత్యమైనది. అట్టి సత్యము వరకు మనం ప్రయాణ మవుతూ పోవాలి. ఈవిధముగా విచారణ చేసినప్పుడే సత్యము మనకు చక్కగా తెలుస్తుంది.

విదేహముక్తి, జీవన్ముక్తి అని రెండు వుంటున్నాయి. ఈ రెండూ వేదాంతములో చాలా ప్రధానమైనవి. జీవన్ముక్తి అనగా ఏమిటి? శరీరము ధరించికూడా past, present, future సర్వమూ ఏకత్వమే అని విశ్వసించాలి. పూర్వము వృక్షముగా వుంటున్నది. దానినుంచి ఈ present అనే seed వచ్చింది. seed యొక్క result future లోపల tree అవుతుంది. past వృక్షము, future వృక్షము, present seed. మూడింటియొక్క ఏకత్వము ఒక్కటే. వృక్షము లేక విత్తనము రాలేదు. విత్తనము లేక వృక్షము రాదు. ఇదే త్రిపుటి ఏకత్వము. మూడింటి ఏకత్వము విశ్వసించినవాడు జీవన్ముక్తుడు. కష్టమును సుఖమును, రెండింటిని సమానముగా చూచేవాడు జీవన్ముక్తుడు. మంచివారు వర్ణించినా, చెడ్డవారు దూషించినా రెండింటిని సమత్వముగా భావించేవాడు జీవన్ముక్తుడు. దూషణభూషణతిరస్కారములన్నింటిని ఏకత్వముగా విశ్వసించినవాడు జీవన్ముక్తుడు. దారిద్ర్యము, సంపద రెండింటిని సమత్వముగా విశ్వసించినవాడు జీవన్ముక్తుడు. అన్నీకూడా కదలిపోయే మేఘములే. ఏదీకూడా శాశ్వతముగా యిక్కడ లేదు. ఇట్టి సత్యము గుర్తించిన వాడు జీవన్ముక్తుడు. అతనికి ఏ విచారము వుండదు. అట్టివాడే జీవన్ముక్తుడు.

అయితే విదేహముక్తుడు ఎవరు? ఇరువురికి వుండిన భేదము ఏమిటి? ఇతనికి దేహము వుంది, అతనికి

దేహము లేదు. విదేహి, దేహము లేనివాడు. దేహము వుంది. దేహభ్రాంతి లేదు. ఆకలిదప్పులు ఏమాత్రమూ ఎరుగడు. జనకమహారాజుకు విదేహుడని పేరు. దేహభ్రాంతి అతనికి లేదు. అందువలనే విదేహుడని పేరు. దేహభ్రాంతి వుండినంతవరకు సుఖదుఃములు తప్పినవికావు. దేహాభిమానము లేనప్పుడు యింక ఏ అభిమానము లేదు. అమనస్కము. మనస్సే లేదు. మనస్సు లేనివానికి సంకల్పములు ఎక్కడనుండి వస్తాయి. సంకల్పములుంటేనే మనస్సు. ఇది వస్త్రము. వస్త్రమునకు దారము వుండాలి. దారమునకు పత్తి వుండాలి. పత్తి దారమైంది. దారము వస్త్రమైంది. పత్తి లేకపోతే దారము లేదు. దారము లేక వస్త్రము లేదు. కాబట్టి, పత్తి సంకల్పము. దారము కోరికలు. దారముల సమ్మిళిత స్వరూపమే వస్త్రము, మనస్సు.

మాయకు లోనాయె మాయకు తానాయె
మాయ ఇరువదియైదు మంత్రములాయె
మాయ యిరువదియైదు మంత్రము తెలిపితే
మాయమాయమాయ మరి బయలాయె.

ఇరువదియైదు మంత్రములు ఏమిటి? ఐదు కర్మేంద్రియములు, ఐదు ప్రాణములు, ఐదు కోశములు, పంచభూతములు, ఈనాలుగు చేరి ఇరవై. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము నాలుగు. తరువాత జీవతత్త్వము. అన్నీ కలిపి ఇరువదిఐదు. ఇరువదియైదు తత్త్వములతో కూడినది పిండము. పిండమనగా దేహము. తల్లి గర్భమునుండి పుట్టినది పిండము. సర్వత్రా వుండినది బ్రహ్మాండము. అండపిండబ్రహ్మాండముయొక్క ఏకత్వమే త్రిపుటియొక్క ఏకత్వము. అదే త్రికూటము. కూటమి అనగా చేరటం. శ్రీరామచంద్రుడు త్రికూట పర్వతముపై వుంటున్నాడు. జీవ, ఈశ్వర, ప్రకృతి మూడింటి కూటము. రామతత్త్వము ఏమిటి? రా అనగా ఆత్మ. మ అనగా మాయ. మాయ ఆత్మతో చేరినప్పుడు రామతత్త్వమైపోతుంది. రామజపమంటే రాంరాంరాం అని జపము చేయటం కాదు. మనస్సు ఆత్మతో ఏకం కావాలి. అదే నిజమైన రామజపము. అదే నిజమైన తారకతత్త్వము. తారకము అంటే ఏమిటి? తెరుపుమరపు అనకుండా అనవరతము అరమరలు లేకుండా ఎప్పుడు తరచుగాచేరెడిది తారకం. జాగ్రత్త స్వప్న సుషుప్తులందు ఏకత్వమైనదే తారకం. ఇటువంటి తారక తత్త్వము గుర్తించుకోలేక రాంరాం అని జపము చేసిన చాలదు. మన మనస్సును ఆత్మతో ఏకం చేయాలి. చూడండి. చక్కెర చేతిలో తెచ్చావు. టంబ్లరులో నీరుంటున్నాది. ఆ నీటిలో పోశావు. కలిపావు. తరువాత చూస్తే చక్కెర చేతికి చిక్కదు. చూచావు. నీటిలో చక్కెర కనిపించటం లేదు. ఎక్కడ పోయింది? నీ చేతితో తెచ్చావు, నీ కండ్లతో చూచావు. ఆ చక్కెర చేతికి చిక్కటం లేదు. కంటికి కనిపించటం లేదు. ఇక్కడ చక్కెర వుందని ఎట్లా గుర్తించ గలవు? నాలుకపై వేసుకున్నప్పుడు చక్కెర వుందని తెలుస్తుంది.

పిల్లలకు కప్పులో జ్యూస్ పోశాము. పండ్లరసము కప్పులో వుంటున్నాది. కానీ, దాని రుచి కప్పుకి తెలియదు. స్ట్రా వేశావు. స్ట్రానుండి నీవు తీసుకుంటున్నావు. జ్యూస్ స్ట్రానుండి పోతున్నాది. స్ట్రాకు రుచి తెలియటం లేదు. నాలుకపై పడేటప్పటికి రుచి తెలుస్తున్నాది. చూచారా! ఎక్కడ రుచి తెలుస్తున్నాది? నాలుకపైన తెలుస్తున్నాది. మన దేహమే ఒక కప్పు. దీనిలో రసస్వరూపమైన దైవముంటున్నాది. దేహానికి తెలియటం లేదు. మన senses straw ఈ senses తో మనము అన్నీ అనుభవిస్తున్నాము. కానీ, దానికికూడా యేమీ తెలియటం లేదు. నాలుకకు మాత్రమే తెలుస్తున్నాది. కానీ అనుభవించటం లేదు. అది తిరిగి జఠరమునకు పంపుతున్నాది. జఠరమునకు కూడా రుచి తెలియదు. మాలిన్యములను పక్కకు నెట్టి నిర్మలమైనదానిని సర్వాంగములకు సప్లై చేస్తున్నది.

అహంవైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

నేను నీ కడుపులో వైశ్వానరుడుగా వుండి నీవు తిన్నది జీర్ణము చేసి నీ దేహానికి సప్లైచేసి శక్తినిస్తున్నాను. ఈవిధంగా వేదాంత విషయములు చక్కగా విచారణ చేస్తూ వస్తే కట్టకడపటికి తేలేది ఒక్కటే. ఏకం సత్, విప్రాబహుదా వదంతి.

truth is only one not two. అంత ఖచ్చితంగా చెబుతూ వచ్చింది వేదాంతము. నేను ఒక్కటే అని చెప్పటం లేదు. నేను ఒక్కటే ఒక్కటి, రెండు కాదు అని గట్టిగా చెబుతున్నది. అంత గంట కొట్టినట్లుగా చెబుతున్నాది, ప్రబోధిస్తున్నాది, ప్రచారము చేస్తున్నాది ప్రపంచమునకు. దైవము ఒక్కడే. అల్లా ఒక్కడే. జీసస్ ఒక్కడే. రాముడు ఒక్కడే. ఈశ్వరుడు ఒక్కడే. విష్ణువు ఒక్కడే. కొంతమంది పరిష్యన్లు జొరాష్ట్ర వేరు అని చెబుతుంటారు. గురునానక్ అని సిఖ్ఖులు చెబుతారు. రాముడు వేరని రామభక్తులు చెబుతారు. కృష్ణుడు వేరని కృష్ణభక్తులు చెబుతారు. కాదుకాదు. అభిరుచులనుబట్టి పోతున్నారెగానీ దైవము ఒక్కడే. నామరూపములు వేరువేరుగా వుంటున్నాయి. మీ జిహ్వాచాపల్యము చేత నాకు మిఠాయి కావాలి, జిలేబి కావాలి, బర్ఫీ కావాలి, మైసూర్‌పాక్ కావాలి అని ఆశిస్తున్నారు. ఈ మిఠాయి, జిలేబి, బర్ఫీ అన్నిటిలోనూ చక్కెర ఒక్కటే. జిహ్వాచాపల్యమే యిన్నివిధములైన రుచులను ఆశిస్తున్నది. ఏ పేరైనా చింతించండి. ఏ రూపమైనా చూడండి. గమ్యము ఒక్కటే. goal is one, God is one. ఏదాన్నికూడా మనం విమర్శించకూడదు. ఏవీ వేరువేరు కాదు. అంతా చేరి ఒక్కటే. ఇలాంటి ఏకత్వము మనం విచారణ చేసినప్పుడే ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. అదే unity in diversity.

beings are many but breath is one
stars are many but sky is one
nations are many but earth is one
jewels are many but gold is one.

ఈ సత్యము మనం చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇది నాకు యిష్టము, ఇది నాకు యిష్టము లేదని ఏమాత్రమూ విభజించకూడదు. ఈవిధమైన ఏకత్వము గుర్తిస్తే తప్పక ఆత్మతత్త్వములో మునుగుతావు. ఎప్పుడు ఏ పని చేసినా I am God, I am God అని ఆ భావముతో చేస్తూ రా. then you become God. నీ సంకల్పములను బట్టి నీ స్వరూపము బయలుదేరుతుంది. కనుక, నీవు అనవసరమైన చింతలు చేయకూడదు. అనవసరమైనవి మాట్లాడకూడదు. ఇతరుల మనసు బాధించకూడదు. ఇతరులకు యేమీ శ్రమ యివ్వకూడదు. ఈవిధమైన తత్త్వమును గుర్తించటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! 5వ తేదీనుండి విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. కొన్ని దినములు ఈ ఉపన్యాసములు మానివేస్తే కొంతవరకు విద్యార్థులకు టైము యిచ్చినట్టవుతుంది. ఎందుకంటే వారు విద్యకోసం వచ్చారు. వేదాతంకోసం రాలేదు. విద్యనుకూడా అభ్యసించాలి. చదవటం జరిగినప్పుడే మీరు వచ్చిన పని పూర్తిగావించుకున్న వారౌతారు. తల్లిదండ్రులు ఎంతో ఆశతో మిమ్మల్ని యిక్కడకు పంపించారు. వారినికూడా మీరు సంతృప్తి పరచాలి. ఎందుకంటే వారుకూడా దైవస్వరూపులే. మాతృదేవోభవ, పితృదేవోభవ. మీరు వచ్చిన పని మొట్టమొదట చక్కగా పూర్తి చేసుకోండి. దీనిని ఫలవంతము చేసుకున్నప్పుడే స్వామికి ఆనందము. కానీ, రూములలో మాట్లాడకుండా, అనవసర విషయాలలో ప్రవేశించకుండా మీ చదువులలో concentrate చేయండి. "O" grade తీసుకురండి. ఇన్‌స్టిట్యూట్‌కి మంచి పేరు తెండి. తల్లిదండ్రులకు తగినంత ఆనందమునందించండి. మీరుకూడా వచ్చిన పని నెరవేర్చుకొని ఆనందముగా వెళ్ళండి.

భజనబినా సుఖశాంతినహి........